# సాగర తీరంలో ఇసుక దొంగలు

ఇప్పటి వరకు భూముల ఆక్రమణలు చూశాం.. పచ్చని కొండలు తొలచి గ్రావెల్, రాయిని అక్రమంగా తరలించడం చూశాం.. ఇక సముద్రం వంతు అన్నట్టుగా ఉంది పరిస్థితి చూస్తే.. సముద్రపు ఇసుక అక్రమ రవాణా సమాచారం అటు మత్స్యకారులను, ఇటు ప్రకృతి ప్రేమికులను వణికిస్తోంది. కడలి కల్లోలాన్ని శాంతపరిచే ఇసుకను తవ్వేస్తూ పోతే.. సంభవించనున్న పెనువిపత్తును తలచుకుంటేనే కలవరం పుడుతోంది.

- తీరప్రాంతంలో ఇసుక అక్రమ రవాణా
- పలు చోట్ల భారీగా ఏర్పడిన గోతులు
- పొంచి ఉన్న పెనుముప్పు
- ఆందోళనలో మత్స్యకారులు

కొమ్మాది: తీరప్రాంతంలో ఇసుకను తవ్వేస్తున్నారు. భీమిలి బీచ్ రోడ్డు తిమ్మాపురం, మంగమారిపేట, ఉప్పాడ తీర ప్రాంతంలో రాత్రి సమయాల్లో కొందరు లారీలు, మినీ వ్యాన్‌ల ద్వారా ఇసుకను అక్రమంగా తరలించేస్తున్నారు. దీంతో తీరం వెంబడి అనేక చోట్ల భారీ గోతులు ఏర్పడుతున్నాయి. ఇదే కొనసాగితే సముద్రం ముందుకు వచ్చే ప్రమాదం తప్పదని మత్స్యకారులు హెచ్చరిస్తున్నారు.


ఇసుక రవాణా కోసం ఏర్పాటు చేసుకున్న రోడ్డు

**ఒక వైపు కోత.. మరోవైపు అక్రమ రవాణా**
ఇప్పటికే తుఫాన్ సమయాల్లో రుషికొండ, ఐటీ జంక్షన్, సాగర్‌నగర్, తిమ్మాపురం, మంగమారిపేట, ఉప్పాడ తీర ప్రాంతాల్లో సముద్రం పెద్ద ఎత్తున కోతకు గురవుతోంది. తీర ప్రాంతంలో అనధికారికంగా కాంక్రీట్ నిర్మాణాలు చేపట్టడంతో సముద్రపు కెరటాలు ఈ ప్రాంతాలవైపు దూసుకు వస్తున్నాయి. ఈ క్రమంలో 2 నుంచి 3 అడుగుల వరకు సముద్రం భారీ ఎత్తున కోతకు గురవుతోంది. దీనికి తోడు ఈ సముద్రపు ఇసుక భారీ స్థాయిలో అక్రమ రవాణా జరగటం తీరప్రాంత వాసులను ఆందోళనకు గురి చేస్తోంది. దీనిపై సంబంధిత అధికారులు పటిష్టమైన చర్యలు తీసుకోకుంటే భవిష్యత్తులో భారీ మూల్యం చెల్లించక తప్పదని ఇక్కడి వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.


మంగమారిపేట బీచ్ వద్ద ఇసుక తరలించడంతో ఏర్పడిన భారీ గొయ్యి


ఉప్పాడలో ఇసుకను తవ్విన ఆనవాళ్లు

**కల్తీ కోసమే ఇసుక**
కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత అమాంతంగా ఇసుక డిమాండ్ పెరిగిపోయింది. దానికి తోడు ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. దీనిని ఆసరాగా తీసుకున్న కొందరు తీరం వెంబడి ఉన్న బీచ్ ఇసుకను లారీల ద్వారా తీసుకుని వెళ్లి, గెడ్డ ఇసుకలో కలిపి విక్రయిస్తున్నారు. దీనికోసమే బీచ్ ఇసుకను అక్రమ రవాణా చేస్తున్నారు. ఈ ఇసుక కల్తీ వలన నిర్మాణాల నాణ్యత ప్రశ్నార్థకమే.

ఇంత జరుగుతున్నా ఏ ఒక్క అధికారి కూడా దీనిపై చర్యలు తీసుకోవడం లేదు. ఈ అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయకుంటే పెను ప్రమాదం తప్పదు. రెవెన్యూ, మైనింగ్, పోలీస్ అధికారులు సమన్వయంతో సముద్రపు ఇసుక అక్రమ రవాణా చేసే వారిపై పటిష్టమైన నిఘా ఏర్పాటు చేసి చర్యలు తీసుకోవాలని ఇక్కడ వారు కోరుతున్నారు.

### అర్ధరాత్రి తరలిస్తున్నారు



మంగమారిపేట బీచ్ వద్ద అర్ధరాత్రి సమయాల్లో బీచ్ ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారు. దీంతో ఈ ప్రాంతాల్లో పెద్ద పెద్ద గోతులు ఏర్పడుతున్నాయి. ఇలా తవ్వుకుంటూ పోతే సముద్రం మరింత ముందుకు వచ్చేస్తుంది. అధికారులు ఈ అక్రమ తవ్వకాలను, రవాణాను అడ్డుకోవాలి.

– మేరుగు చిన్నారావు, మత్స్యకారుడు, మంగమారిపేట

### భవిష్యత్తులో పెనుముప్పు



ఉప్పాడ, తిమ్మాపురం, మంగమారిపేట తీర ప్రాంతాల్లో ఇసుక రవాణా చేసే వారిపై పటిష్టమైన నిఘా ఏర్పాటు చేసి చర్యలు తీసుకుంటే తప్ప దీనికి అడ్డుకట్ట వేయలేం. వీటిని ఇలా వదిలేస్తే భవిష్యత్తులో పెను ప్రమాదం తప్పదు. అధికారులు ఇప్పటికైనా కఠిన చర్యలు తీసుకోవాలి.

– శివకుమార్, మత్స్యకారుడు, రామాద్రి

### నిఘా ఏర్పాటు చేస్తాం

ఉప్పాడ, మంగమారిపేట తీరప్రాంతాల్లో బీచ్ ఇసుక అక్రమ రవాణా మా దృష్టికి వచ్చింది. ఈ ప్రాంతాల్లో ప్రత్యేకమైన నిఘా ఏర్పాటు చేస్తాం. సముద్రపు ఇసుక అక్రమ రవాణా చేసేవారు ఎంతటి వారైనా క్షమించే ప్రసక్తి లేదు. ఈ తీర ప్రాంతాల్లో సిబ్బందిని ఏర్పాటు చేసి, అక్రమ రవాణా జరగకుండా కఠినమైన చర్యలు తీసుకుంటాం.

– ఎం.శ్రీనివాస్, ఏడీ, మైనింగ్

## జెడ్జీకి అభినందనలు


జెడ్సీ సింహాచలంను అభినందిస్తున్న మారుతీప్రసాద్, ప్రసన్న కుమార్

మధురవాడ: జీవీఎంసీ జోన్–2 కమిషనర్ సింహాచలంను వైఎస్సార్‌సీపీ సాంస్కృతిక విభాగం రీజనల్ ఇన్‌చార్జ్ వంకాయల మారుతీ ప్రసాద్, జీవీఎంసీ బ్రాండ్ అంబాసిడర్, సినీ ఆర్టిస్ట్ ఇన్నవోలు ప్రసన్న కుమార్ శుక్రవారం మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. జెడ్సీగా ఇటీవల సింహాచలం బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా ఆయనకు అభినందనలు తెలిపి, సత్కరించారు.

## సీఆర్పీల ఉత్తరాంధ్ర సదస్సు రేపు

తగరపువలస: ఏపీ సీఆర్పీ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 17న నిర్వహించనున్న ఉత్తరాంధ్ర సదస్సును విజయవంతం చేయాలని ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు గిరి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి కె.గురువులు, వర్కింగ్ ప్రెసిడెంట్ తవిటినాయుడు కోరారు. 'విద్యాశాఖలో సీఆర్పీల పాత్ర' అంశంపై ఆ రోజు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఈ సదస్సు జరుగుతుందని ప్రకటనలో పేర్కొన్నారు. చెరకుపల్లి అవంతి ఇంజినీరింగ్ కళాశాల ఎదురుగా ఎంఎస్‌ఆర్ ఫంక్షన్ హాల్లో జరిగే సదస్సుకు ఎంపీ భరత్, భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవి రావు, విద్యాశాఖ ఆర్జేడీ విజయభాస్కర్, డీఈవో ప్రేమ్‌కుమార్, ఉత్తరాంధ్రలోని ఆరు జిల్లాలకు చెందిన సీఆర్పీలు హాజరవుతారని తెలియజేశారు.

## క్లుప్తంగా

### శ్రీరంగనాథుని భూముల్లో హెచ్చరిక బోర్డులు


గుడిలోవలో హెచ్చరిక బోర్డును పరిశీలిస్తున్న దేవదాయశాఖ ఏసీ అన్నపూర్ణ

తగరపువలస: దేవదాయశాఖ ప్రతిష్టాత్మకంగా తీసుకుని స్వాధీనం చేసుకున్న ఆనందపురం మండలంలోని శ్రీరంగనాథుని భూములలో శుక్రవారం హెచ్చరికల బోర్డులు ఏర్పాటు చేసింది. పాలవలస పంచాయతీ గుడిలోవ సర్వే నంబర్ 69లో 15 ఏళ్లుగా న్యాయస్థానంలో ఉన్న 26 ఎకరాల 25 సెంట్ల స్థలాన్ని దేవదాయశాఖ గెలుచుకున్న సంగతి తెలిసిందే. ఈ మేరకు దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ టి.అన్నపూర్ణ ఆధ్వర్యంలో సిబ్బంది హెచ్చరికల బోర్డులు ఏర్పాటు చేశారు. న్యాయవాది ఎస్.వి.ఎస్. ప్రసాద్‌వర్మ, దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ ఎం.శ్రీధర్, ఈవో ఎస్.నానాజీ బాబు తదితరులు పాల్గొన్నారు.

### కాంగ్రెస్ సమన్వయకర్తగా వీర్రాజు

భీమునిపట్నం: భీమిలి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్తగా శుక్రవారం నండూరి వీర్రాజు నియమితులయ్యారు. ఈ మేరకు ఏపీసీసీ అధ్యక్షురాలు షర్మిల ఆయనకు నియామక పత్రం అందించారు.

### శుక్రవారం డ్రై డే పాటించాలి


అవగాహన కల్పిస్తున్న అధికారులు

కొమ్మాది: ప్రతి ఒక్కరు వారంలో శుక్రవారాన్ని డ్రై డేగా పాటించాలని ఏఎంవోహెచ్ డా. కిషోర్ సూచించారు. 8వ వార్డు రుషికొండలో శుక్రవారం డ్రై డేపై ప్రజలకు అవగాహన కల్పించారు. నివాస ప్రాంతాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని, తడి చెత్త.. పొడిచెత్త వేరువేరుగా నిల్వ చేసుకోవాలని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ లొడగల అప్పారావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవి, మంగరాజు, సూపర్‌వైజర్లు శేఖర్, రవ్వ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

### ఎన్‌సీడీ సర్వే పరిశీలన


అనంతవరంలో సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీవో విజయ్ కుమార్

పద్మనాభం: మండలంలోని అనంతవరంలో జరుగుతున్న ఎన్‌సీడీ సర్వేను ఎంపీడీవో ఎం.విజయ్ కుమార్ శుక్రవారం క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. బీపీ, షుగర్, బ్రెస్ట్ క్యాన్సర్ తదితర వ్యాధిగ్రస్తులు ఏ ఒక్కరూ ఉండిపోకుండా సర్వేలో గుర్తించాలని సిబ్బందికి ఎంపీడీవో సూచించారు.

### నటుడు కృష్ణకు నివాళులు


కృష్ణ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న వెంకటరెడ్డి తదితరులు

తగరపువలస: నటుడు కృష్ణ రెండో వర్ధంతి సందర్భంగా జీవీఎంసీ రెండోవార్డు జీరుపేట వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి జీరు వెంకటరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో నాయకులు చిల్ల గణేష్‌రెడ్డి, వెంపాడ వెంకటరమణ, జీరు భారతిరెడ్డి, జీరు త్రినాధరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మత్స్యకారులకు ఇబ్బంది కలిగితే సహించం

భీమునిపట్నం: భీమిలి తీర ప్రాంతాల్లో నివసిస్తున్న మత్స్యకారులకు ఇబ్బంది కలిగే విధంగా ఆక్రమణలు జరుగుతున్నాయని ఎగువపేట మత్స్యకారుల గ్రామాభివృద్ధి సేవా సంఘం అధ్యక్షుడు గంటా నూకరాజు అన్నారు. వాటిని ఏమాత్రం సహించబోమన్నారు. ఆక్రమణలకు నిరసనగా మత్స్యకారుల ఐక్య కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన రిలే దీక్షలో పాల్గొన్న ఆయన మాట్లాడారు. మత్స్యకారులకు సంబంధించిన శ్మశానాలను కూడా వదలకుండా ఆక్రమిస్తున్నారని, దీన్ని తాము ఏమాత్రం సహించేది లేదని స్పష్టం చేశారు. దీనిపై అధికారుల దృష్టికి తీసుకువెళ్లామని, ఇటువంటి వారిపై చర్యలు తీసుకోకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు అల్లిపిల్లి నర్సింగరావు, బర్రి కొండబాబు, మైలిపల్లి షణ్ముఖరావు, వాసుపల్లి గరగయ్య, వాసుపల్లి కొండబాబు తదితరులు పాల్గొన్నారు.


రిలే దీక్ష నిర్వహిస్తున్న మత్స్యకారులు

## గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన

తగరపువలస: ఆనందపురం శాఖా గ్రంథాలయంలో శుక్రవారం పుస్తక ప్రదర్శన జరిగింది. 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా ఏర్పాటు చేసిన ఈ ప్రదర్శనలో పురాణ, ఇతిహాసాలతో పాటు పలు ఆధ్యాత్మిక గ్రంథాలు, జనరల్ నాలెడ్జ్, తత్వశాస్త్రం, వ్యాకరణం, కళలు, సాహిత్యం, చరిత్రకు సంబంధించిన పలు పుస్తకాలు ఉంచారు. కార్యక్రమంలో ఆనందపురం వెనుకబడిన తరగతుల సంక్షేమ వసతి గృహం విద్యార్థులు పాల్గొన్నారు. సీనియర్ నాయకులు చందక సూరిబాబు, కొట్యాడ రెడ్డిబాబు, బ్రాంచి గ్రంథాలయ అధికారి బి.వి.ఎస్. అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

- చెరకుపల్లి అవంతి ఇంజినీరింగ్ కళాశాలలో జరిగిన పుస్తక ప్రదర్శనను ప్రిన్సిపాల్ బి.మురళీకృష్ణ ప్రారంభించారు. ఇందులో శాస్త్ర, సాంకేతిక రంగాలకు చెందిన పుస్తకాలతో పాటు స్వాతంత్ర సమరయోధుల పుస్తకాలు ఉంచారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారులు తిప్పాన జగన్నాథం, రమణ, శ్రీనివాసరావు, గోక చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.


పుస్తక పఠనం గురించి అవగాహన కల్పిస్తున్న చందక సూరిబాబు

## వీసీసీ ఆధ్వర్యంలో విద్యార్థులకు పోటీలు


సర్టిఫికెట్లతో విద్యార్థులు, నిర్వాహకులు

మధురవాడ: బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు వైజాగ్ చిల్డ్రన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో మధురవాడ పవన్‌మిత్ర అపార్ట్‌మెంట్ పరిసర ప్రాంతాల పిల్లలకు వివిధ రకాల పోటీలు నిర్వహించి, విజేతలకు శుక్రవారం బహుమతులు అందజేశారు. నిర్వాహకులు మాట్లాడుతూ పిల్లలకు వ్యాసరచన, చిత్రలేఖనం, క్విజ్, మెమొరీ గేమ్ ఇతర పోటీలు నిర్వహించామన్నారు. ఆసరా చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులు సునీత, రోటరీ క్లబ్ సమకూర్చిన బహుమతులను విజేతలకు సీఐటీయూ నాయకురాలు మంగశ్రీ, వీసీసీ ప్రతినిధులు రవి, పవిత్ర అందజేశారు. కార్యక్రమంలో కొండమ్మ, సుజాత, ఎస్. పుష్ప తదితరులు పాల్గొన్నారు.

## 'ఉల్లాస్'పై శిక్షణ నేడు

పద్మనాభం: వెలుగు కార్యాలయంలో ఉల్లాస్ (అండర్‌స్టాండింగ్ ఆఫ్ లైఫ్‌లాంగ్ లెర్నింగ్ ఫర్ ఆల్ ఇన్ సొసైటీ)పై వలంటీర్లకు శిక్షణ ఇవ్వనున్నట్లు ఎంపీడీవో ఎం.విజయ్ కుమార్ తెలిపారు. ఉదయం పది గంటలకు ప్రారంభం కానున్న ఈ శిక్షణకు వలంటీర్లు అందరూ హాజరు కావాలని కోరారు.

## పట్టుదలతో చదివితే ఉత్తమ ఫలితాలు

భీమునిపట్నం: ప్రతి ఒక్కరూ పట్టుదలతో చదివితే ఉత్తమ ఫలితాలను సాధించవచ్చని విద్యాశాఖ ఆర్‌జేడీ విజయ భాస్కర్ అన్నారు. స్థానిక కస్తూర్బా గాంధీ విద్యాలయాన్ని శుక్రవారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. విద్యార్థినులతో ఆయన మాట్లాడుతూ సమయం చాలా విలువైందని, దాన్ని ఏమాత్రం వృథా చేయకూడదని తెలిపారు. లక్ష్యాన్ని ముందే నిర్దేశించుకుని, ప్రణాళికాబద్ధంగా చదివితే విజయం సొంతమవుతుందన్నారు. అనంతరం విద్యార్థులకు కల్పించిన వసతులను పరిశీలించారు. వంటశాలను, వండిన వంటలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. పిల్లలకు స్వయంగా వడ్డించారు. కార్యక్రమంలో ఎంఈవో– 2 జయప్రద, ప్రిన్సిపాల్ గంగాకుమారి, సిబ్బంది పాల్గొన్నారు.


విద్యార్థినులకు అన్నం వడ్డిస్తున్న విజయభాస్కర్

## బిర్సాముండా పోరాటం స్ఫూర్తిదాయకం

భీమునిపట్నం: ఆదివాసీల విప్లవ నాయకుడు, స్వాతంత్ర్య సమరయోధుడు బిర్సాముండా పోరాటం స్ఫూర్తిదాయకమని స్థానిక జిల్లా విద్యా శిక్షణ సంస్థ (డైట్) ప్రిన్సిపాల్ ఎం.జ్యోతికుమరి అన్నారు. బిర్సాముండా జయంతి సందర్భంగా శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయనకు నివాళులర్పించారు. జార్ఖండ్‌లో జన్మించిన బిర్సా ముండా ఆదివాసులపై అధిక పన్నులను వసూలు చేస్తున్న బ్రిటిష్ వారిని ఎదిరించి అనేక పోరాటాలు చేశారన్నారు. ఆయన త్యాగం ఎనలేనిదన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు గొట్టేటి రవి, ఎల్. సుధాకర్, జి.జి.ఎస్. నాగేశ్వరరావు, సి.ఎ.సోమయాజులు పాల్గొన్నారు.


ఆదివాసీల పద్ధతిలో నివాళులు అర్పిస్తున్న ఛాత్రోపాధ్యాయులు, అధ్యాపకులు

## పాఠశాల దశలోనే ఉజ్వల భవితకు పునాది

పీఎం పాలెం: జీవితంలో వివిధ రంగాలలో రాణించేందుకు, ఉజ్వల భవితను అందుకునేందుకు పాఠశాల విద్యార్థి దశ పునాది వంటిదని జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి జూన్ గాలియట్ అన్నారు. పీఎం పాలెం సాంకేతిక ఇంజినీరింగ్ కళాశాల గ్రౌండ్‌లో రెండు రోజులుగా నిర్వహిస్తున్న మాలతాంబ స్పోర్ట్స్ మీట్ ముగింపు కార్యక్రమంలో శుక్రవారం ఆమె పాల్గొని ప్రసంగించారు. క్రీడల్లో రాణించే విద్యార్థులకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో కీర్తిప్రతిష్టలు ఆర్జించే గొప్ప అవకాశం ఉంటుందన్నారు. మాలతాంబ విద్యాసంస్థల అధినేత, జిల్లా బాస్కెట్ బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు సునీల్ మహంతి మాట్లాడుతూ మానసిక, శారీరక ఆరోగ్యం కోసం ప్రతీ విద్యార్థి రోజూ క్రీడలకు కొంత సమయం కేటాయించాలని సూచించారు. విశాఖ నార్త్ డివిజన్ ట్రాఫిక్ సీఐ ఎన్. సాయి, స్థానిక ట్రాఫిక్ ఎస్ఐ ప్రసాద్ ప్రసంగించారు. స్పోర్ట్స్ మీట్ విజేతలకు జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో స్కూల్ జనరల్ మేనేజర్ డాక్టర్ జీపీఆర్ కృష్ణ, ప్రిన్సిపాల్ ఆదిమూర్తి, బి.శ్రీదేవి, పీడీ హారిస్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి జూన్ గాలియట్

# దేదీప్యమానం .. జ్వాలాతోరణం

ఆలయాలు కార్తీక కాంతులతో కళకళలాడాయి. కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని శివాలయాలు భక్తులతో కిక్కిరిశాయి. వేకువజామున పరమేశ్వరుడికి అభిషేకాలు, అర్చనలు చేశారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు ధ్వజస్తంభాల వద్ద దీపాలు వెలిగించారు. ఆలయ ప్రాంగణాల్లో సాయంత్రం జ్వాలాతోరణాలు వెలిగించారు.

- భక్తిశ్రద్ధలతో కార్తీక పౌర్ణమి
- భక్తులతో కళకళలాడిన శివాలయాలు
- కనులపండువగా జ్వాలాతోరణ మహోత్సవం

పీఎం పాలెం: కార్తీక పౌర్ణమిని నియోజకవర్గంలో శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అభిషేక ప్రియుడికి నీరాజనాలు సమర్పించారు. కారుషెడ్ శ్రీ కాశీ ఉమామహేశ్వర స్వామి ఆలయం ప్రాంగణంలో శుక్రవారం సాయంత్రం 7 గంటలకు జ్వాలాతోరణ మహోత్సవం నిర్వహించారు. నింగికి ఎగసి మండుతున్న జ్వాలాతోరణం మధ్య నుంచి భక్తులు మూడు సార్లు ప్రదక్షిణలు చేశారు. అనంతరం శివాలయంలో అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు పోతిన శ్రీనివాసరావు, బాలాజీ, సూర్యారావు, నాయుడు తదితరులు పాల్గొన్నారు

**అష్టలక్ష్మి ఆలయంలో..**
కొమ్మాది: స్థానిక అన్నంరాజునగర్‌లోని అష్టలక్ష్మి దేవాలయంలో కార్తీక పౌర్ణమి సందర్భంగా విశేష పూజలు నిర్వహించారు. సుప్రభాత సేవ అనంతరం శ్రీ లక్ష్మీనారాయణులకు పంచామృతాలతో అభిషేకాలు చేసి దీపారాధన, సాలగ్రామ దానం నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోని వైశాఖేశ్వర ఆలయంలో స్ఫటిక లింగ స్వరూపునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

**వారిజ ఆశ్రమంలో..**
బీచ్ రోడ్డు మంగమారిపేట, వారిజ ఆశ్రమంలోని శ్రీ లక్ష్మీ హయగ్రీవ మందిరంలో లక్ష్మీనారాయణ స్వామికి ప్రత్యేక పూజల అనంతరం అభిషేకం, హోమం, అర్చన, మంగళ హారతి నిర్వహించారు.

- ఎండాడలో గల శివాలయంలో పరమేశ్వరుడికి ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని, దీపారాధన చేశారు.

**గెద్దపేటలో..**
పద్మనాభం: కోరాడ పంచాయతీ గెద్దపేటలోని సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం రాత్రి జ్వాలా తోరణ ఉత్సవం ఘనంగా నిర్వహించారు. ముందుగా పార్వతి పరమేశ్వరుల విగ్రహాలను పట్టుకుని భక్తులు ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేశారు. అనంతరం జ్వాలా తోరణ ఉత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో తొమ్మిది వందల మంది దీపాలు వెలిగించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త పూర్ణ చంద్రరావు పాల్గొన్నారు.


కారుషెడ్ శివాలయం వద్ద జ్వాలా తోరణం


ప్రత్యేక పూజలు అందుకున్న లక్ష్మీ నారాయణులు


జ్వాలా తోరణ ఉత్సవంలో పాల్గొన్న స్థానిక నాయకులు, భక్తులు


గెద్దపేటలో జ్వాలా తోరణం

## ఎన్‌ఎంఎంఎస్ విద్యార్థులకు నిష్ణాతుల శిక్షణ


నాన్‌వెర్బల్ పుస్తకాలు పంపిణీ చేస్తున్న నిర్వాహకులు

తగరపువలస: ఫ్రెండ్స్ ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో చిట్టివలస జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు ఇస్తున్న ఉచిత శిక్షణకు గుంటూరు జిల్లా తెనాలికి చెందిన ఎన్‌టీఎస్‌ఈ శిక్షణ సంస్థ నిర్వాహకుడు రాజారావు వచ్చారు.ఈయన విద్యార్థులకు మూడురోజుల పాటు ఉచిత క్రాష్ కోర్సులో శిక్షణ ఇవ్వనున్నారు. విద్యార్థులకు స్నిగ్ధశ్రీదేవి ఫౌండేషన్ అందించిన రూ.18వేల విలువైన నాన్ వెర్బల్ రీజనింగ్ పుస్తకాలు పంపిణీ చేశారు. సొసైటీ వ్యవస్థాపకుడు గంటాన మోహనరావు, ప్రధాన కార్యదర్శి రేఖ అప్పారావు, కోశాధికారి అప్పారావు, హెచ్‌ఎం మురళీమోహనరావు పాల్గొన్నారు.

## తిమ్మాపురం గ్రామ సభలో 21 దరఖాస్తులు


గ్రామ సభ నిర్వహిస్తున్న రెవెన్యూ అధికారులు

పద్మనాభం: రీ సర్వేలో తప్పుల సవరణ కోసం మండలంలోని తిమ్మాపురంలో శుక్రవారం నిర్వహించిన గ్రామ సభకు 21 దరఖాస్తులు వచ్చాయి. పేర్లు, విస్తీర్ణం సరి చేయాలని కోరుతూ రైతులు ఈ దరఖాస్తులు చేసుకున్నారు. రీ సర్వే డీటీ వరలక్ష్మి దరఖాస్తులు స్వీకరించారు.

## డివైడర్‌ను ఢీకొన్న బైక్

ఇద్దరు విద్యార్థులకు గాయాలు

పీఎం పాలెం: ద్విచక్రవాహనంపై వెళ్తున్న యువకుడు డివైడర్‌ను ఢీ కొట్టిన ఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఇందుకు సంబంధించి పీఎం పాలెం పోలీస్ స్టేషన్ సీఐ బాలకృష్ణ తెలిపిన వివరాలివి.. కొమ్మాది శ్రీవిద్య పాఠశాల సమీపంలో నివసిస్తున్న సుంకర గౌరీశంకర్ కుమారుడు బాలాజీ గాయత్రి కళాశాలలో డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. ఈ నెల 14వ తేదీ సాయంత్రం వైఎస్సార్ కాలనీలో నివసిస్తున్న తన స్నేహితుడు మహమ్మద్ నౌషద్ పుట్టినరోజు వేడుకలకు బాలాజీ హాజరయ్యాడు. కేక్ కట్ చేసిన అనంతరం బాలాజీ, నౌషద్ రుషికొండ బీచ్‌కు బైక్‌పై బయల్దేరారు. ఈ క్రమంలో ఎండాడ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ సమీపంలో లా కాలేజీ రోడ్డులో బైక్ డివైడర్‌ను ఢీ కొనడంతో, ఇద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. వీరిని చికిత్స నిమిత్తం గీతం ఆస్పత్రికి తరలించి, కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

## భీమిలి తీరంలో సముద్ర స్నానాలు


భీమిలి తీరంలో స్నానం చేస్తున్న భక్తులు

భీమునిపట్నం: కార్తీక పౌర్ణమి సందర్భంగా భీమిలి తీరంలో శుక్రవారం భక్తులు సముద్రస్నానాలు చేశారు. ఉదయం ఆరు గంటల నుంచి పరిసర ప్రాంతాల భక్తులు స్నానాలకు తరలి వచ్చారు. అనంతరం తీరంలో పూజలు చేశారు. అలల ఉధృతి తక్కువగా ఉండడంతో ప్రశాంతంగా స్నానాలు చేశారు.